నేడు ప్రజావాణి కార్యక్రమం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



కొలన్ సుభాష్‌రెడ్డిని సత్కరిస్తున్న రమేష్‌ముదిరాజ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. పూజల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి.రమేష్‌ముదిరాజ్, జే.చిత్తారి, శివముదిరాజ్, మహేందర్‌ముదిరాజ్, వాసుబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లోని ఐసీఎం ఆధ్వర్యంలో ర్యాలీ



రాజేంద్రనగర్: గుజరాత్‌లో టీఎస్‌యూ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించడాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్‌లోని ఐసీఎం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఐసీఎం డైరెక్టర్ డాక్టర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఎం ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాజేంద్రనగర్ అధ్యక్షుడిగా గోపాల్ ముదిరాజ్



నియమాక పత్రాన్ని అందుకుంటున్న గోపాల్ ముదిరాజ్

రాజేంద్రనగర్: బీసీ సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా బండ్లగూడ జాగీర్ ఆదర్శనగర్ కాలనీకి చెందిన గోపాల్ ముదిరాజ్‌ను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియమించారు. బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాజకీయంగా ఎదగడానికి ప్రయత్నించాలని కోరారు. గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ బీసీల కోసం నిబద్ధతతో పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు విక్రమ్, శ్యామ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పీరంచెరువు వద్ద చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు వద్ద చిన్నారులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. చెరువు సుందరీకరణతో పాటు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్స్ ఆకట్టుకున్నాయి. మొక్కలు నాటి చెట్లను పెంచాలి, చెరువుల వద్ద చెత్త, కవర్లు తదితర వాటిని వేయవద్దు అంటూ చిన్నారులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు.



గగన్‌పహాడ్‌లో తొట్టెల ఊరేగింపు



బోనాల ఊరేగింపులో భక్తులు



మైలార్‌దేవ్‌పల్లిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

చల్లంగ చూడమ్మ అమ్మోరు తల్లీ

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గగన్‌పహాడ్ బస్తీలలో గ్రామ దేవతల బోనాల వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను అందంగా ముస్తాబు చేసి తరలివెళ్లారు. డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి మెయిన్ విలేజ్, పల్లెచెరువు, ఉరగుట్టలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో..

రాజేంద్రనగర్: ఆషాఢమాసం బోనాలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శంషాబాద్‌లో ఘనంగా బోనాలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో బోనాల పండగ ఘనంగా జరిగింది. పట్టణంలోని సాతంరాయి, సూరజ్‌గార్డెన్, పోచమ్మబస్తీ, ఆర్బీనగర్, మధురానగర్, సిద్ధాంతి, కొత్వాల్‌గూడ, ఎయిర్‌పోర్టు కాలనీ,



ఊరేగింపుగా తరలి వెళ్తున్న భక్తులు

ఊట్‌పల్లి, తొండుపల్లి, గొల్లపల్లిలోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆ పార్టీ నేతలతో కలిసి ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు చక్రధర్‌రెడ్డి తదితరులతో కలిసి పట్టణంలోని పలు ఆలయాల వద్ద అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి: ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఆదివారం ఘనంగా జరిగాయి. నల్ల పోచమ్మ, ఊరు పోచమ్మ విలేజ్‌లో, బాబుల్‌రెడ్డి నగర్, లక్ష్మీగూడ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల వద్ద బోనాల ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఘటాల ఊరేగింపులో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.



పూజల్లో తోకల శ్రీనివాస్‌రెడ్డి



సూరజ్‌గార్డెన్‌లో అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి

ఆ పార్టీలతో విసుగుచెంది బీఆర్ఎస్‌లోకి..

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు జాతీయ పార్టీలకు చెయ్యి, పువ్వు ఇచ్చి కారెక్కుతున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన 200 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనతో, రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనతో విసుగుచెంది గులాబీ గూటికి చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో రాములు, శ్రీశైలం, రాములు, నిరంజన్, మల్లేష్, కిరణ్, లక్ష్మణ్, క్రాంతి, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాముయాదవ్, యూత్ అధ్యక్షుడు రాఘవేందర్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం, గుమ్మడి కుమార్, జి.రాజు తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు అవసరం

ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ

మణికొండ: ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకొని పోషక విలువలు ఉన్న ఆహారంతో పాటు డాక్టర్ల సలహా ప్రకారం మందులు వాడాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో శ్రీరామ క్లినిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల కోసం ఉచితంగా ఆరోగ్య పరీక్షల కేంద్రం ఏర్పాటు చేయగా.. ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల్లో పోషక విలువలు తగ్గి అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. ఫోన్లలో కాలక్షేపం చేయడం సమస్యగా మారిందన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు న్యూట్రిషన్, పెరుగుదల, వ్యాక్సినేషన్‌లపై అవగాహన కల్పించడం, పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఉమామహేశ్వరితో పాటు అలకాపూర్ టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.



ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన వంశీ

ఏరులా పారుతున్న మురుగు

అత్తాపూర్: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ప్రధాన రహదారి సెయింట్ జోసఫ్ కాలేజీ సమీపంలో మురుగు పారుతుండటంతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది. వారం రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు రోడ్డుపై పారుతోంది. ఆ రోడ్డు మార్గంలో వెళ్లే వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ వ్యవస్థ ఇలా ఉంటే అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉందో స్పష్టమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

'వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది'

గోల్కొండ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఐఏఎస్ అధికారి ఎస్.సంగీతసత్యనారాయణ అన్నారు. ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమం సందర్భంగా ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ మహ్మద్ మజ్హరుల్లాకు ఆయన కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ వారు ఈ సర్టిఫికెట్ అందిస్తున్నారని ఒక ఏడాది లెర్నింగ్ ప్రొగ్రామ్ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ప్రశంసాపత్రాలతో పాటు సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. డిజైనింగ్ అండ్ మేనేజింగ్ ఎఫెక్టివ్ హెల్త్ కేర్ సిస్టమ్స్‌కు చెందిన ప్రొఫెసర్ సారంగ్‌దేవ్, ప్రొగ్రామ్ అధికారి నేహాసారంగి తదితరులున్నారు.

చాక్లెట్లలో పురుగులు

జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్: తాను కొనుగోలు చేసిన డ్రైఫ్రూట్స్‌లో పురుగులు వచ్చాయని, ఇదే విషయాన్ని సదరు షాపు నిర్వాహకులకు తెలిపితే నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్‌లో నివసించే డాక్టర్ పెరూర్ పురేందర్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–36లోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్ డేట్స్ అండ్ నట్స్‌లో డ్రై డేటెడ్ బ్లాక్, యూఎస్‌ఏ పిస్తా, యూఎస్‌ఏ వాల్‌నట్, ఆల్మండ్ డేటెడ్ చాక్లెట్స్‌తో పాటు మరికొన్ని డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి చూడగా డేటెడ్ చాక్లెట్స్‌లో తెల్లని పురుగులు కనిపించాయి. దీంతో వెంటనే ఆయన సదరు షాపునకు వచ్చి సిబ్బందికి పురుగులు ఉన్న చాక్లెట్ చూపించాడు. షాపు సిబ్బంది ఏమాత్రం స్పందించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్స్ ఎల్ఎల్‌పీ మేనేజ్‌మెంట్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 125, 274, 275, 59 ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన 'ఆచార్య వందన'

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న గురుపూజోత్సవ వేడుకల్లో భాగంగా ఆచార్య వందన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. పద్మభూషణ్ దివంగత డాక్టర్ వెంపటి చినసత్యం ప్రథమ పుత్రిక నాట్యగురువు కామేశ్వరి శిష్య బృందం పాల్గొన్నారు. జతిస్వరం, రామాయణ శబ్దం, భావయామి, ఎటువంటివాడే, తారంగం, పదవర్ణం, మోహనకళ్యాణి, తిల్లాన అంశాలను కళాకారులు కళ్యాణి, అక్షిత, కీర్తన, శ్రియ, సౌమ్య, అనన్య, జస్మిత ప్రదర్శించారు.



బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్

మణికొండ: పండగలు సంతోషం, ఆహ్లాదాన్ని పంచుతాయని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పైప్‌లైన్ రోడ్డు, శ్రీరాంనగర్ కాలనీ ప్రవేశం వద్ద ఉన్న రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలలో ఆదివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన బోనాలను నిర్వహించేందుకు ఆయా దేవాలయాల వద్ద ఆలయ కమిటీలు, మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, ప్రజలు సంతోషంగా బోనాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బుద్దోలు మీన ముత్యాలు, పురుషోత్తం, కె.లక్ష్మీనారాయణ, నాయకులు జె.సిద్దప్ప, సి.బీరప్ప, కె.శివారామిరెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బోనాల ఉత్సవాలలో మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్లు

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్తా

మణికొండ: పేదలకు మన శక్తి మేరకు సహకారం అందజేసి వారికి మేలు చేసే కార్యక్రమాలు, సేవలను మరింత విస్తృతం చేయాలని భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్తా అన్నారు. మణికొండ ప్రాంత పరిషత్ కౌన్సిల్ సమావేశం హుడా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మణికొండ పరిషత్ సభ్యులు ఇటీవల చేపట్టిన సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకుని అభినందించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తండ్రి లేని పిల్లలకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. అందించాలన్నారు. మొక్కల పెంపకం, నేషనల్ గ్రూప్ సాంగ్స్, గురు వందన్ చాత్రాభినందన్, భారత్ కో జానో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు జిల్లా విద్యాధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీలను ఆహ్వానించాలని నిర్ణయించారు.



కౌన్సిల్ సమావేశంలో భారత్ వికాస్ పరిషత్ నాయకులు

సమావేశంలో రాష్ట్ర ప్రాంత ఉపాధ్యక్షుడు రఘు సతీష్ కుమార్, కార్యదర్శి శివరామకృష్ణ, కన్వీనర్ సదాశివరెడ్డి, ప్రముఖలు ఫణికుమార్, మాధవి మోహన్, గౌరీ శంకర్, బ్రాంచ్ అధ్యక్షుడు పెంటారెడ్డి, కార్యదర్శి బాలభారతి, రాజశేఖర్, ప్రభుజీ, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మణికొండ: రానున్న కాలంలో పేదలకు ఇళ్ల స్థలాలను ఇప్పించే లక్ష్యంతో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గండిపేట మండల 4వ మహాసభను కోకాపేటలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ అంటేనే పేదల పార్టీ అని, ఆ పేదలకు కూడు, గూడును ప్రభుత్వాల నుంచి ఇప్పించేందుకు పార్టీ పోరాటాలు చేస్తుందన్నారు. సీపీఐ 100 సంవత్సరాల వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందని, గండిపేట మండలంలోను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, ఎస్.మల్లేష్ స్వామి, బాబురావు, శంకరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండిపేట మండల కమిటీ కార్యదర్శిగా ఎస్.మల్లేష్, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్‌తో పాటు 15 మంది కౌన్సిల్, ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న జంగయ్య

ఒడిదుడుకులను అధిగమిస్తేనే ఉన్నత లక్ష్యాలకు..

అత్తాపూర్: ప్రతి ఒక్కరూ ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకం చదవాలని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని బీజేపీ అత్తాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సాబాద విజయ్ కుమార్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఒడిదుడుకులు సహజమేనని, వాటిని అధిగమించిన వారే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి రాంచంద్రారెడ్డి, డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మహేందర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని విజయ్‌కుమార్‌కు అందజేస్తున్న బండారు దత్తాత్రేయ

ఉత్సాహంగా క్లీన్ బండ్లగూడ

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పచ్చదనాన్ని పెంపొందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డీఈ యాదయ్య అన్నారు. క్లీన్ బండ్లగూడ– గ్రీన్ బండ్లగూడలో భాగంగా ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాలలో చెత్త నివారణ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయి బాలాజీనగర్, ఇండస్ వ్యాలీ, యాదయ్యనగర్, తిరుమలహిల్స్ కాలనీ, కేకే–1 నగర్, కృష్ణారెడ్డి కాలనీ, ఇందిరానగర్ కాలనీల ప్రజలు పాల్గొని ఆరుబయట చెత్త వేయడం వల్ల కలిగే ఇబ్బందుల గురించి కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అదే సమయంలో చెత్త వేస్తున్న వారికి రూ.500 జరిమానా కూడా విధించారు. కార్యక్రమంలో లిబ్దం విల్లాస్ ప్రెసిడెంట్ మాధవరెడ్డి, ఏసీఎఫ్ ప్రెసిడెంట్ వినయ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నరేందర్‌బాబు, తిరుమల హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్, కేకే–1 ప్రెసిడెంట్ రాధాకృష్ణ, కృష్ణారెడ్డి కాలనీ ప్రెసిడెంట్ విజయ్‌చారి, యాదయ్యనగర్ ప్రెసిడెంట్ నర్సింహ, ఇండస్ వ్యాలీ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు

ఉపన్యాసం ప్రాముఖ్యతను గుర్తించాలి

చందానగర్: నేటి విద్యా వాతావరణంలో ఉపన్యాసం యొక్క ప్రాముఖ్యతను గుర్తించాలని డాక్టర్ సరోజ్ బజాజ్ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధి గంగారంలోని సుమన్ బాలికల జూనియర్ కళాశాల, మహిళా దక్షతా సమితి, బన్సీలాల్ మలానీ నర్సింగ్ కళాశాలల ప్రాంగణంలో ఆదివారం 'మీ మెదడు చదవడం'పై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త, విద్యావేత్త డాక్టర్ ఆకాష్ అగర్వాల్ హాజరై మాట్లాడుతూ మనం బోధించే.. నేర్చుకునే విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అంశం అని అన్నారు. ఐఐఎస్‌సీ వంటి ప్రముఖ సంస్థలలో సంవత్సరాల తరబడి చేసిన పరిశోధనల ఆధారంగా పారిస్‌లో మేరీ క్యూరీ ఫెలోగా మెదడు అంచనా, నమూనా గుర్తింపు, సందర్భోచిత అవగాహన ద్వారా వచనాన్ని ఎలా అర్థం చేసుకుంటుందో వివరించారు. పదాలు తారుమారైనప్పుడు లేదా సంఖ్యా ప్రత్యామ్నాయాలను కలిగి ఉన్నప్పుడు కూడా మనం ఎలా చదవగలమో ప్రదర్శించారు. ప్రస్తుతం ఏక్ స్టెప్ ఫౌండేషన్‌తో అనుబంధం ఉందని, అక్షరాస్యతను మెరుగుపరచడానికి ఆచరణాత్మక సాధనాలుగా మార్చడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్నా జగెటియా, సంయుక్త కార్యదర్శి విమల బద్రుకా, సీమా కొఠారి, అనసూయ, సుశీల పాటిల్, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

